మిల్లర్ల అక్రమాల వెనుక నేతల అండ



- జిల్లాలో రెండేళ్ల నుంచి యథేచ్ఛగా అక్రమదందా
- మాఫియాను తలదన్నే రీతిలో అక్రమాలు
- వెన్నుదన్నుగా నిలిచిన ప్రస్తుత మాజీ ప్రజా ప్రతినిధి
- బినామీ రూపంలో కొత్త వ్యవహారం
- 200 కోట్ల విలువైన ధాన్యం స్కాంపై సర్కారు సీరియస్

నిర్మల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : గత రెండేళ్ల నుంచి నిర్మల్ జిల్లాలో యథేచ్ఛగా సాగుతున్న సీఎంఆర్ ధాన్యం వ్యవహారంపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. చాలా రోజుల నుంచి ధాన్యం అక్రమాలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నప్పటికీ ఇప్పటి వరకు సీరియస్ యాక్షన్ చేపట్టకపోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఓ ప్రజా ప్రతినిధి వెన్నుదన్నుగా నిలవడంతో ఓ ప్రాంతానికి చెందిన రైస్‌మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి సరికొత్త పథకానికి వ్యూహరచన చేశారు. కొంతమంది అధికారుల అండతో పాటు ఈ మాజీ ప్రజా ప్రతినిధి వెన్నుదన్నుగా నిలవడంతో ఈ రైస్‌మిల్లర్లు రెచ్చిపోయారు. 2022 ఖరీఫ్‌సీజన్ నుంచి ఈ రైస్ మిల్లర్ల సిండికేట్ అక్రమాల పర్వానికి తెర లేపింది. ఖరీఫ్‌సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం కేటాయించిన సీఎంఆర్ ధాన్యం కోటా లెక్కలను వారు తలకిందులు చేసే ఎత్తుగడకు శ్రీకారం చుట్టారు. ఆ యేడు కేటాయించిన ధాన్యం కోటాను వివరాలకు అనుగుణంగా సీఎంఆర్ బియ్యం కోసం మిల్లింగ్ చేయకుండా పూర్తిస్థాయిలో మిల్లింగ్ చేయకుండా సగానికి పైగా అలాగే నిల్వ ఉంచారు. ఇలా మిల్లింగ్ ప్రక్రియ కొనసాగుతుండగానే మళ్లీ ప్రభుత్వం రబీధాన్యం కోటాను సంబంధిత మిల్లులకు కేటాయించింది. ఇటు ఖరీఫ్, రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం నిల్వలు ఈ మిల్లర్ల వద్దనే ఉండిపోయాయి. మిల్లింగ్‌ను ఆలస్యం చేస్తూ కోటాకు అనుగుణంగా బియ్యాన్ని ఇవ్వకుండా ఆ ధాన్యాన్నంతా పక్కదోవ పట్టించి కోట్ల రూపాయలను నగదుకు మార్చుకున్నారని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఏ సీజన్ కోసం కేటాయించిన ధాన్యాన్ని ఆ సీజన్‌లోనే మిల్లింగ్ చేయకుండా ఎగవేత వ్యవహారాన్ని కొనసాగించినప్పటికీ సంబంధిత మిల్లర్లపై అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోకపోవడం వారికి కలిసొచ్చింది. ఈ వ్యవహారంలో అధికారులు మిల్లర్లకు పరోక్షంగా సహకరించారన్న ఆరోపణలున్నాయి. దీనికి తోడు ఓ రాజకీయనేత ఒత్తిళ్లు కూడా కొనసాగడంతో అధికారులు అక్రమాలకు పరోక్షంగా సహకరించారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే రైస్‌మిల్లర్ల సిండికేట్ ఇలా సీజన్‌ల వారీగా ధాన్యాన్ని పెద్దమొత్తంలో గోల్‌మాల్ చేసి లెక్కలను తారుమారు చేస్తూ కోట్ల రూపాయల సర్కారు ధనానికి గండి కొట్టారని సంబంధిత అధికారుల దర్యాప్తులో వెలుగు చూడడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఈ నేపథ్యంలోనే ఓ రైస్‌మిల్లు యాజమాన్యం దాదాపు రూ.48 కోట్ల రూపాయల ధాన్యాన్ని పక్కదోవ పట్టించిన వ్యవహారంపై ఉదాసీనంగా వ్యవహరించిన ముగ్గురు జిల్లాస్థాయి అధికారులపై ప్రభుత్వం ఎట్టకేలకు వేటు వేసి కొరడా ఝులిపించడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది.

అక్రమాలపై సర్కారు సీరియస్

గత మూడేళ్ల నుంచి అప్పటి సర్కారులో ప్రాతినిధ్యం వహించిన ప్రజా ప్రతినిధుల అండదండలతో యథేచ్ఛగా సాగిన సీఎంఆర్ ధాన్యం అక్రమాలపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. మొత్తం జిల్లాలోని రైస్‌మిల్లులకు సీజన్‌ల వారీగా కేటాయించిన సీఎంఆర్ ధాన్యం లెక్కలపై ఆరా తీస్తోంది. ఖరీఫ్, రబీసీజన్‌ల మధ్య ఎంత మేర ధాన్యాన్ని మిల్లింగ్ చేశారనే అంశంతో పాటు అప్పటి స్టార్ రిజిస్ట్రార్‌లపై విచారణ జరుపుతోంది. ఇలా సీజన్‌కు సీజన్‌కు మధ్య చోటు చేసుకున్న ధాన్యం అక్రమాల లెక్కలు ఇప్పటికే ఓ కొలిక్కి వచ్చాయి. దీని ఆధారంగా దాదాపు 200 కోట్లకు పైగా సీఎంఆర్ ధాన్యంలో అక్రమాలు జరిగినట్లు సర్కారు తేల్చింది. అయితే ఆషామాషీ చర్యలు కాకుండా సీరియస్ చర్యలు చేపడితేనే పరిస్థితిలో మార్పు వస్తుందని అలాగే సంబంధిత శాఖ అధికారులు, సిబ్బందికి సైతం భయం పడుతుందన్న భావనతో ప్రభుత్వం ఏకంగా జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారిని అలాగే పౌర సరఫరాలసంస్థ మేనేజర్‌తో పాటు ఓ డిప్యూటీ తహసీల్దార్‌ను అనూహ్యంగా సస్పెండ్ చేసి కొరఢా ఝులిపించింది.

బినామీల తంత్రం

కాగా రాజకీయ అండదండలతో అధికారులపై అన్ని రకాల ఒత్తిళ్లు తీసుకువచ్చిన రైస్‌మిల్లర్ల సిండికేట్ మరో కొత్త తరహా అక్రమదందాకు తెరతీసి తమ ఎత్తుగడలను అమలు చేసింది. వ్యూహాత్మకంగా కొంత మంది రైస్‌మిల్లర్లు తమకున్న రైస్‌మిల్లులతో పాటు మరికొన్ని రైస్‌మిల్లులను బినామీల పేరిట ఏర్పాటు చేసి అక్రమాలకు మరింతగా ఊతమిచ్చారు. తమకున్న మిల్లు నుంచి బినామీ మిల్లులోకి ధాన్యం స్టాక్‌ను వ్యూహాత్మకంగా మార్పించుకొని ఒక సీజన్‌కు సంబంధించిన ధాన్యం లెక్కలను తారుమారు చేశారన్న ఫిర్యాదులున్నాయి. వీరికి సంబంధిత శాఖ అధికారులు సైతం పరోక్ష తోడ్పాటునందించినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

రాజకీయ నేత అండతోనే..

కాగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లాలోని ఓ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన ఓ ప్రజా ప్రతినిధి అండదండలు ఈ అక్రమ దందా వెనక ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఓ రైస్‌మిల్లులో భారీ ఎత్తున అక్రమాలు వెలుగు చూసినప్పటికీ సదరు మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోవడానికి జరిగిన జాప్యం వెనక ఈ నేత హస్తం ఉన్నట్లు బహిరంగంగా ఆరోపణలున్నాయి. అయితే మరో ప్రజా ప్రతినిధి సదరు నేత వ్యవహార శైలిని పరోక్షంగా అడ్డుకున్నట్లు కూడా చెబుతున్నారు. చిలికి చిలికి గాలివానలాగా అక్రమాల వ్యవహారం వందల కోట్ల రూపాయలు దాటడంతో ఇక ప్రస్తుత ప్రభుత్వం నేతల ఒత్తిడిలు, పైరవీలను పక్కన పెట్టి అక్రమాలకు పాల్పడిన రైస్‌మిల్లర్లపై కఠినచర్యలకు నడుం బిగించింది. ఇందులో భాగంగానే జిల్లాలోని 21 రైస్‌మిల్లులపై కేసులు నమోదు చేసింది. ఇందులో నుంచి పది మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేయగా ఎనిమిది మిల్లుల ఆస్తులను జప్తు చేసేందుకు చర్యలు మొదలుపెట్టింది.

నిర్మల్‌లో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



ఎన్టీఆర్‌కు నివాళులర్పించి నినాదాలు చేస్తున్న టీడీపీ నాయకులు

నిర్మల్ కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం శ్రేణులు నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఎన్టీఆర్ నాయకత్వంలో తెలుగు దేశం పార్టీ ఆవిర్భవించి పేద, బడుగు వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అందుబాటులోకి వచ్చాయని నాయకులు అన్నారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్, మాజీ కౌన్సిలర్ డి. శ్రీనివాస్, ఆ పార్టీ అధ్యక్షుడు సిరికొండ రమేష్, ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, పలు మండల పార్టీ నాయకులు షైక్‌మౌలానా, వెంకన్న, అబ్దుల్‌గఫూర్, తదితరులు పాల్గొన్నారు.

జీవశాస్త్ర పరీక్షకు 11 మంది విద్యార్థుల గైర్హాజరు

నిర్మల్ కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి జీవశాస్త్ర పరీక్షకు శనివారం 11 మంది గైర్హాజరైనట్లు డీఈవో రామారావు తెలిపారు. 9,118 మంది హాజరయ్యారన్నారు. జవాబు పత్రాలు పోస్ట్ ఆఫీస్‌లో సరైన విధంగా పోస్ట్ చేయాలని సూచించారు. నిర్మల్‌లోని చాణక్య ఉన్నత పాఠశాలను సందర్శించారు. పలు సూచనలు చేశారు

శిక్షణ సంస్థలు రేపటిలోగా వివరాలు ఇవ్వండి

నిర్మల్ కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మైనారిటీ యువతకు శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న సంస్థలు 31 సాయంత్రం లోగా వివరాలు హార్డ్ కాపీలు మేనేజింగ్ డైరెక్టర్ మైనారిటీ కార్పొరేషన్ కార్యాలయంలో సమర్పించాలని జిల్లా మైనారిటీ అధికారి ఆర్. మోహన్ సింగ్ ఒక ప్రకటనలో కోరారు. భాగస్వామ్య ఎంప్యానల్‌తో ఒప్పందం కుదుర్చుకుంటుందన్నారు. వివరాలకు 040 - 23391067 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ ప్రారంభం



అదనపు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణను శనివారం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్, మైనారిటీ వేల్ఫేర్ ఆధ్వర్యంలో మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ఫ్యాషన్ డిజైనింగ్‌లో శిక్షణ పొందితే స్వయం ఉపాధి పొందవచ్చునని అన్నారు. ప్రతి మహిళ తన ప్రతిభ నిరూపించుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు ఏవైనా ఉన్నట్లయితే వారికి అవకాశం కల్పించనున్నట్టు తెలిపారు. మైనారిటీ శాఖ అధికారి మోహన్‌సింగ్, ఏక్తా సొసైటీ అధ్యక్షుడు షూక్ ముజాహిద్, హబీబ్ అలీ, అజీమ్ బీన్ యాహియా, సలీమ్, జాఫర్, సాజిద్, అల్మాస్, అఫ్రోజ్, తదితరులు పాల్గొన్నారు.

శనేశ్వరాలయాలకు పోటెత్తిన భక్తులు

- దర్శనం కోసం బారులు
- భక్తిశ్రద్ధలతో తైలాభిషేకాలు



భైంసాలో శనీశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భైంసా, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): శని అమావాస్యను పురస్కరించుకొని శనివారం భైంసా పట్టణంలోని పురాణా బజార్, మహాలక్ష్మీ జ్యువెల్లరీ మార్కెట్ పరిధిలోని శనేశ్వరాలయాలకు శనివారం ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. శనివారం అమావాస్య రావడం అరుదు కావడంతో ఆ రోజున శనేశ్వరునికి టెంకాయను నైవేద్యంగా సమర్పించి తైలాభిషేకం నిర్వహిస్తే శనిబాధల నుంచి విముక్తి లభిస్తుందని భక్తుల అపార నమ్మకం. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పట్టణ పరిధిలోని రెండు శనేశ్వరాలయకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజల నిర్వాహణ కోసం గాను బారులు తీరారు. భక్తిశ్రద్ధలతో శనైశ్వరాలయంలోని విగ్రహాల చుట్టు నవధాన్యాలతో ప్రదక్షిణలు చేపట్టారు. అనంతరం టెంకాయలను శనేశ్వరునికి సమర్పించి తైలంతో విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. పురాణాబజార్ ప్రాంతంలోని శనేశ్వరాలయానికి వేలాది మంది భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు.

కల్లూరు వాగు సమీపంలో..



కల్లూరు శనీశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల, మార్చి, 29 : (ఆంధ్రజ్యోతి) : శనివారం అమావాస్యను పురస్కరించుకొని మండలంలోని కల్లూరు వాగు సమీపంలో గల శనీశ్వర ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. పలు గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శనీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పొరదేవి దర్శనానికి పాదయాత్ర



భైంసా, మార్చి29 (ఆంధ్రజ్యోతి) : సేవాలాల్ దీక్షదారుల సందడి ఇక్కడి ప్రాంతంలో అధికంగా కనిపిస్తోంది. పొరదేవి దర్శనానికి పాదయాత్రన బయలు దేరుతున్న నిజామాబాద్ జిల్లా దీక్షదారులు భైంసా మీదుగా తరులుతున్నారు. శనివారం నిజామాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలోని బాన్స్‌వాడ, జుక్కల్,బోధన్ తదితర మండలాలకు చెందిన 70 మందికి పైగా సేవాలాల్ దీక్షదారులు పొరదేవి దర్శనానికి పాదయాత్రతో బయలు దేరారు. మధ్యాహ్నం వేళలో ఇక్కడికి చేరుకున్న సేవాలాల్ దీక్షదారులకు స్థానిక పొరదేవి భక్తులు పట్టణ సరిహద్దు ప్రాంతంలో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం బిక్షా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి భజన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం వారంతా పాదయాత్రగా కుభీర్ మండలం మీదుగా పొరదేవి దర్శనానికి తరలివెళ్లారు. శ్రీరామ నవమి వరకల్లా మహారాష్ట్రంలోని వాసిమ్ జిల్లా పరిధిలోని పొరదేవి ఆలయం చెంతకు చేరుకొని పూజలు చేపడుతామని సేవాలాల్ దీక్షాదారులు వెల్లడించారు.

ముధోల్ మండలం విట్టోలి తండా నుంచి

ముథోల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండలంలోని విట్టోలి తాండ నుండి శనివారం సేవాలాల్ మహారాజ్ దీక్షపరులు మహారాష్ట్రలోని పొరదేవి వరకు పాదయాత్రతో బయలుదేరారు. ఈ సందర్భంగా తాండ వాసులు ఈ దీక్షపరులకు మంగళహారతులతో ఊరి పొలిమేర వరకు సాగనంపారు. కఠోర దీక్షతో నియమ నిష్ఠలతో సేవాలాల్ దీక్షను స్వీకరించిన భక్తులు సుమారు 21 మంది పొరదేవిని దర్శించుకునేందుకు పాదయాత్ర ద్వారా బయలుదేరారు.

మహిళా సంఘాల ఉత్పత్తులకు పూర్తిస్థాయి హక్కులు

- మేధో సంపత్తి హక్కులపై అవగాహన కార్యక్రమంలో ఫ్యాకల్టీ స్వప్న



కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ జగదీశ్వర్ గౌడ్

నిర్మల్ కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులకు పూర్తి స్థాయి హక్కులు లభించేలా వారికి శిక్షణ ఇస్తున్నట్లు ఎంఎస్ఎం ఈ జాతీయ సంస్థ ఫ్యాకల్టీ స్వప్న అన్నారు. శనివారం నిర్మల్ మున్సిపల్ పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు మేధో సంపత్తి హక్కులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... శిక్షణ పొందిన మహిళా సంఘాలకు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఈ సర్టిఫికెట్లు వారికి పూర్తి స్థాయి హక్కులు కల్పిస్తాయన్నారు. మహిళలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా ఉత్పత్తులు తయారు చేయాలని సూచించారు. వస్తువులకు బ్రాండింగ్, ప్యాకింగ్ నాణ్యత ప్రమాణాలు ముఖ్యమని అన్నారు. ఆన్‌లైన్ మార్కెటింగ్ సౌకర్యం కల్పించనున్నట్టు చెప్పారు. కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ... ప్రభుత్వం మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తోందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసే దిశగా ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. ఉత్సాహ వంతులైన మహిళలకు ట్రాక్టర్లు రుణాలుగా అందజేసి చెత్త సేకరణకు వారి సేవలను వినియోగించుకుంటామని తెలిపారు. మున్సిపాలిటీలో జరిగే ప్రతి కార్యక్రమంలో మహిళలను భాగస్వాములుగా చేస్తామన్నారు. కొయ్యబొమ్మల ఉత్పత్తిదారులకు మేధో సంపత్తి హక్కులు సంక్రమించినట్టు వెల్లడించారు. మెప్మా పీడీ సుభాష్ మాట్లాడుతూ... ఇప్పటికే ఒక్కో సంఘానికి ప్రభుత్వం 20 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పించిందన్నారు. స్త్రీనిధి ద్వారా మహిళలకు జీవనోపాధి పెంపుకు రుణాలు అందిస్తున్నామని వివరించారు. సంఘాల్లో చేరని వారు చేరి జీవనోపాధిని మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఎంఎస్ఎంఈ అధికారి జి. సుదర్శన్, సమన్వయకర్త దత్తాద్రి, మహిళా స్వయం సహాయ సంఘాలు పాల్గొన్నాయి.

ప్రారంభమైన అఖండ హరినామ సప్తాహం



సప్తాహం, జ్ఞానేశ్వరి పారాయణం ప్రారంభిస్తున్న నరసింహారావుజోషి

భైంసా రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కామోల్ గ్రామంలో శనివారం శ్రీరామ నవమి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉదయం 6 గంటలకు నరసింహరావు జోషి ఆధ్వర్యంలో అఖండ హరినామ సప్తాహం, జ్ఞానేశ్వరి పారాయణం ప్రారంభించారు. ఏడు రోజులపాటు జరిగే ఈ సప్తాహం కార్యక్రమంలో ప్రతిరోజు రాత్రి తెలుగులో కీర్తన కార్యక్రమాలు నిర్వహిస్తారు. వివిధ జిల్లాల నుంచి గాయని కళాకారులు, మృదంగం మాస్టర్లు పెద్ద ఎత్తున హాజరవుతారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వీడీసీ మెంబర్లు, తదితరులు పాల్గొంటారు.

గవర్నమెంట్ హైస్కూల్‌కు వాటర్ ఫిల్టర్ విరాళం ఇచ్చిన యూనీమనీ సంస్థ



వాటర్ ప్యూరిఫైయర్ అందజేస్తున్న యూని మనీ సంస్థ

నిర్మల్ అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ మనీ ట్రాన్స్ఫర్ కంపెనీ యూనిమనీ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా స్థానిక జుమ్మెరాత్‌పేట్ గవర్నమెంట్ హైస్కూల్ విద్యార్థుల కోసం సుమారు 25 వేల రూపాయలు విలువైన వాటర్ ప్యూరిఫైయర్‌ను బహూకరించింది. ఈ సంస్థ నిర్మల్ బ్రాంచ్ మేనేజర్ ఎన్. రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం ఈ వాటర్ ప్యూరిఫైయర్‌ను పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ రవికుమార్ మాట్లాడుతూ... తమ సంస్థ సామాజిక కార్యక్రమాల నిర్వహణలో భాగంగా గవర్నమెంట్ స్కూల్ విద్యార్థుల కోసం ఈ వాటర్ ప్యూరిఫైయర్‌ను విరాళంగా అందజేసినట్లు తెలిపారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అల్లం రవిబాబు మాట్లాడుతూ...యూని మనీ పేద విద్యార్థుల కోసం వాటర్ ప్యూరిఫైయర్‌ను విరాళంగా ఇచ్చి దాతృత్వాన్ని చాటుకుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది సంతోష్, అఖిలేష్, నర్సయ్యతో పాటు స్కూల్ టీచర్లు దత్తురామ్, రమణ, వినోద్‌కుమార్, ఇర్ఫాన్‌షేక్, ఖమర్, దయానంద్, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీమంత్, కూన శృతి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకోబోతున్న వ్యక్తిని కాపాడిన పెట్రోకార్ సిబ్బంది



ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

చిట్యాల బ్రిడ్జిపై ఘటన

నిర్మల్ రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిట్యాల బ్రిడ్జిపై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తిని శనివారం పోలీసులు రక్షించినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... నర్సాపూర్ మండలానికి చెందిన శ్రీకాంత్ చిట్యాల బ్రిడ్జి పైన మద్యం తాగి, మత్తులో ఆత్మహత్యా యత్నానికి యత్నించాడు. డయల్ 100కు సమాచారం అందు కున్న పెట్రోకార్ విధులు నిర్వహిస్తున్న పోలీసులు రజిత, శ్రావల్లిక, సంతోష్ సంఘటన స్థలానికి చేరుకొని వ్యక్తిని రక్షించారు. ఈ సందర్భంగా పోలీసులను ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.

పన్నుల చెల్లింపునకు నేడు, రేపు ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు

- మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్

నిర్మల్ కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా ఆది, సోమవారాలు ఆస్తి పన్ను, నల్లా బిల్లుల చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఆస్తి, నల్లా బిల్లుతో పాటు ట్రేడ్ లైసెన్స్‌ల ఫీజులు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

2న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు

నిర్మల్ కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఏప్రిల్ 2న సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి వేడుకలను కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి డి. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, అధికారులు పాల్గొనాలని కోరారు.

3న దొడ్డి కొమురయ్య జయంతి

నిర్మల్ కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు ఏప్రిల్ 3న కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తుననట్టు జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి డి. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, అధికారులు హాజరు కావాలని కోరారు.

గొల్లమాడ గ్రామం నుంచి అగ్నివీర్‌కు ఎంపికయిన ఇద్దరు యువకులు

నర్సాపూర్(జి), మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లమాడ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులకు ప్రభుత్వ కొలువులు వరించాయి. గ్రామానికి చెందిన తోట లక్ష్మణ్, లంబాడి నందకిషోర్ ఇటీవలే విడుదలైన అగ్నివీర్‌లో కొలువులు సాధించారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులకు ఉద్యోగాలు రావడంతో గ్రామస్థులు వారిని అభినందించారు.

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును బహిష్కరిస్తున్నాం

- బీఆర్ఎస్ మైనారిటీ సెల్ పట్టణ అధ్యక్షుడు

ఖానాపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ ప్రభుత్వం శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును బహిష్కరిస్తున్నామని బీఆర్ఎస్ మైనారిటీ సెల్ పట్టణ అధ్యక్షుడు షోయబ్ హుస్సేన్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఖానాపూర్‌లో ఇప్పటి వరకు నూతన ఈద్గా కొరకు ఎలాంటి అభివృద్ధి నిధులు మంజూరు చేయకపోగా కొంతమంది మైనారిటీ నాయకులు తమ పెత్తనం కోసం మౌలానా అబుల్ కలాం విగ్రహం విషయంలో ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించారన్నారు. ఈ వివాదంలో ఖానాపూర్‌కు చెందిన కొంతమంది మైనారిటీ నాయకులపై పోలీస్ కేసులు నమోదు చేయడం సమంజసం కాదన్నారు. ఇటువంటి చర్యలను ఖండిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ ఇఫ్తార్ విందును బహిష్కరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తైబజార్ వేలం రద్దు

ఖానాపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : శనివారం నిర్వహించాల్సిన తై బజార్ వేలం రద్దయినట్లు మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుండి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు గల కాలానికి నిర్వహించేందుకు నిర్ణయించిన తై బజార్ వేలంలో పాల్గొనేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో శనివారం తై బజార్ బహిరంగ వేలాన్ని రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

శనిదేవుని ఆలయం ముందు భక్తుల బారులు



పూజలు చేస్తున్న మహిళ

ఆదిలాబాద్, మార్చి29 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగకు ముందు అమావాస్య శనివారం రావడంతో భక్తులు ఆలయాలకు పోటెత్తారు. శనిదేవునికి ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయక్‌చౌక్‌లోని శనిదేవున్ని దర్శించుకునేందుకు ఆలయానికి భక్తులు భారీగా క్యూకట్టారు. భారీగా వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. వినాయకచౌక్ ఆలయం నుంచి మోచిగల్లీ వరకు కిలో మీటర్ మేర భక్తులు బారులు తీరారు. భక్తుల సౌకర్యార్థం కోసం నీడ, తాగునీరు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

తాంసి : మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో శని దేవునికి తొమ్మిది నవధాన్యాలతో పాటు నువ్వుల నూనెను సమర్పించారు. కొందరు నల్లవస్త్రాలను ధరించి శని దేవునికి పూజలు నిర్వహించారు.

11వ రోజుకు సీసీఐ దీక్ష

ఆదిలాబాద్ రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్‌లో సీసీఐ ఫ్యాక్టరీ ప్రారంభం కోసం సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట దీక్షలు కొనసాగుతున్నాయి. దీక్షలు 11వ రోజుకు చేరుకోగా పద్మశాలి సంఘం నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపి నిరసన కొనసాగించారు. వారికి సాధన కమిటీ సభ్యులు పూలమాలలు వేసి దీక్షలు ప్రారంభించారు.

నిరుపేదలకు రంజాన్ కిట్ల అందజేత

ఆదిలాబాద్ రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ మాసం సందర్భంగా ఆదిలాబాద్‌లోని షాదీఖానా, భుక్తాపూర్, న్యూ హౌసింగ్ బోర్డు కాలనీ, సుభాష్ నగర్, బంగారిగూడ కాలనీల్లో నిరుపేద ముస్లిం కుటుంబాలకు సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి రంజాన్ కిట్లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

రుణమాఫీ చేయకుంటే ఆందోళనలు చేస్తాం

● బీజేపీ అధ్యక్షుడు సామ సంతోష్‌రెడ్డి

తాంసి , మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రేవంత్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తిస్థాయి రైతులకు రుణమాఫీ చేస్తామని ప్రకటించినప్పటికీ ఇంకా చేయకపోవడం సమంజసం కాదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. రేషన్ కార్డుకు లింకు లేకుండా పూర్తిస్థాయి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సుధాకర్ యాదవ్, నాయకులు నర్సారెడ్డి ఉన్నారు

పశుగ్రాసం దగ్ధం

బోథ్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలో ఉన్న రైతు మందుల భోజన్న మొక్కజొన్న చేనులో శనివారం అగ్నిప్రమాదం సంభవించడంతో ఆరుఎకరాలలో ఉన్న మొక్కజొన్న పశుగ్రాసం దగ్ధమైంది. డంపింగ్‌యార్డులో నుంచి నిప్పురవ్వలు గాలికి లేచి పక్కనే ఉన్న పంట చేనులోకి వ్యాపించాయి. స్థానికులు మంటలను ఆర్పివేశారు.

'పాస్టర్ ప్రవీణ్ మరణం మిస్టరీ తేల్చాలి'

ఉట్నూర్, మార్చి29 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ మృతి మిస్టరీని ప్రభుత్వం తేల్చాలని ఉట్నూర్ డివిజన్ పాస్టర్ అసోసియేషన్, క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షులు డానియల్, ప్రధాన కార్యదర్శి జోసెఫ్‌లు డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ ప్రవీణ్ మృతి తీరనిలోటు అన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని వడూర్ గ్రామ యువకులు బజార్‌హత్నూర్ మండలంలోని మారుమూల ప్రాంతమైన చినుమియా తండా గ్రామస్తులు నేరడిగొండ మండల కేంద్రంలో గల బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలు వివరించారు. అనంతరం బోథ్ మండలంలోని మర్లపల్లి గ్రామానికి చెందిన ఓ.శంకర్ రావ్‌కు రూ.58 వేల విలువ గల మంజూరు అయిన సీఎంఆర్ఎస్ చెక్కును ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అందజేశారు. ఏప్రిల్ 1న ఆదిలాబాద్‌లో పదివేల మందికి అన్నదానం చేస్తున్నట్లు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఏప్రిల్ 1న ఆదిలాబాద్‌లో దీక్ష భూమి కొత్తపల్లి నుంచి బంజారా కాశీ పౌరదేవి మహారాష్ట్ర వరకు సేవాలాల్ దళ్ పాదయాత్ర ఉంటుందన్నారు.

బోథ్ : బోథ్ పట్టణంలో నెలకొన్న సమస్యలపై స్పందించి పరిష్కరించాలని గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు అల్లకొండ పోతన్న ఎమ్మెల్యే జాదవ్‌అనిల్‌ను కోరారు. శనివారం వీడీసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. యువకులకు లైబ్రరీ అవసరమని భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే గ్రంథాలయ భవనంతో పాటు ఫ్రెండ్స్ క్లబ్ మైదానంలో ఇండోర్ స్టేడియాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

కలిసిన వారిలో వీడీసీ ప్రధాన కార్యదర్శి సాయినాథ్ గౌడ్, కోశాధికారి రాయపల్లి రమాకాంత్, ఉపాధ్యక్షులు సయ్యద్ యాసిన్‌లతో పాటు బీఆర్ఎస్ నాయకులు మేడ్పల్ ప్రవీణ్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు ఉన్నారు.

తలమడుగు : మండలంలోని టోకిగూడ గ్రామాన్ని కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని టోకీగూడ షేర్‌గుడా ఆదివాసి గిరిజనులు ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. తమ గ్రామాలను కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరాగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో టోకీగూడ గ్రామాన్ని కొత్త పంచాయతీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామన్నారు.

ఇచ్చోడ : రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు హిందూ ముస్లింల మధ్య ఐక్యతను చాటుతాయని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం ఇచ్చోడ మండల కేంద్రంలోని ఈద్గా మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

సిరిచెల్మ మల్లన్నకు పోటెత్తిన భక్తులు



మల్లన్న ఆలయం వద్ద భక్తులు

ఇచ్చోడ,మార్చి29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిచెల్మ మల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం అమావాస్య సందర్భంగా భక్తులు పెద్దఎత్తున పోటెత్తారు. ఆలయం చెరువులో స్నానాలు ఆచరించి శనిశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం అమావాస్య కొత్త ఉగాది అమావాస్య కావడంతో భక్తులు ఆలయంలోపల నుంచి చెరువు గట్టు వరకు భారీ ఎత్తున పోటెత్తారు. దీంతో ఆలయ సమీపమంతా పండుగ వాతావరణం నెలకొంది.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ఇచ్చోడ, మార్చి29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నసల్యాద గ్రామానికి చెందిన కాత్లె లక్ష్మణ్ (40) పురుగుల మందు తాగి మృతిచెందాడు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.... సల్యాద గ్రామానికి చెందిన లక్ష్మణ్ గత కొన్ని రోజులుగా మద్యం తాగుతు ఎటువంటి పని చేయకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. శనివారం ఉదయం 4గంటల ప్రాంతంలో పురుగుల మందు తాగి ఇంటికి వచ్చాడు. వాంతులు చేసుకోవడంతో పురుగుల మందు తాగానని భార్య లక్ష్మికి తెలిపాడు. వెంటనే ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుతుళ్ళు, కుమారుడున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ఇంద్రవెల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్నూర్‌లో నిరుపేద ముస్లిం కుటుంబాలకు హైమన్ డార్ఫ్ - బెట్టి ఎలిజీబెత్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపకులు దుర్వ సంతోష్ నిత్యవసర సరుకులను శనివారం అందజేశారు. మనుషులంతా ఒక్కటేనని, కుల మత ప్రాంత బేధాలు లేకుండా ప్రతి ఒక్కరూ సోదర భావంతో అన్ని పండుగలను జరుపుకోవాలని సూచించారు.

రేషన్‌షాప్‌లకు చేరుకుంటున్న సన్నబియ్యం

● పంపిణీకి ఏర్పాట్లు చేపడుతున్న అధికారులు



రేషన్‌షాపులకు వస్తున్న సన్న బియ్యం వాహనం

తలమడుగు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సన్న బియ్యాన్ని తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ నుంచి పంపిణీ చేసినందుకు అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు. అదేవిధంగా జిల్లా సివిల్‌సప్లై కార్యాలయం నుంచి మండలానికి సన్న బియ్యం పంపిణీ చేపడుతున్నారు. మండలంలోని 16 రేషన్‌షాపులగాను 9,529 రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారు ఒక్కొక్కరికి ఆరుకిలోలు చొప్పున పండుగ పంపిణీ చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఏర్పాట్లు చేపడుతున్నామని తహసీల్దార్ రాజమోహన్ తెలిపారు. పండుగ రోజు సన్న బియ్యం కార్యక్రమాన్ని ప్రారంభించి తర్వాత ప్రతి ఒక్కరికి అదే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం : సీఐటీయూ

ఆదిలాబాద్ రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ఆదిలా బాద్‌లో నిర్వహించిన సీఐటీయూ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో కార్యదర్శి కూరపాటి రమేష్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. ఏప్రిల్ 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హక్కుల సాధన కోసం కార్మికలోకం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

రథయాత్ర కరపత్రాల ఆవిష్కరణ

నేరడిగొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మణ్ లక్ష కిలోమీటర్ల రథయాత్ర కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ధర్మ సమాజ్ పార్టీ అధినేత డాక్టర్ విశారదన్ మహారాజ్ లక్ష కిలో మీటర్ల రథయాత్ర చేస్తున్నారన్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



పార్టీ జెండా ఎగురవేస్తున్న టీడీపీ నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి 29: తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం ఆదిలాబాద్‌లో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఎన్టీఆర్‌చౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీజెండాను ఆ పార్టీ సీనియర్ నాయకుడు రాజారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తలమడుగు : బడుగు బలహీన వర్గాల అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాడేరాములు అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం సుంకిడి గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావదినోత్సవ సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ సామ గంగారెడ్డి, మహేష్, నారాయణ, రాములు పాల్గొన్నారు.

'ఉగాది పండుగకు ఎంతో విశిష్టత'

ఆదిలాబాద్ రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : హిందూ ధర్మంలో ఉగాది పండుగకు ఎంతో విశిష్టత ఉందని శ్రీగోపాల కృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి పేర్కొన్నారు. ఆదిలాబాద్ శ్రీ గోపాలకృష్ణ మఠంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈనెల 30న ఉగాది పండుగను పురస్కరించుకొని సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి వితరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

హీరాసుక్క చిత్రపటానికి ప్రత్యేక పూజలు

ఇంద్రవెల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధానగూడలో ఆదివాసీ ప్రధాన్ పురహిత్ సంఘం ఆధ్వర్యంలో శనివారం గోండి ధర్మగురు హీరసుక చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేస్లాపూర్ నాగోబా ఆలయ ఆవరణలో ఆవిష్కరించిన హీరాసుక జెండాను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ గేడం జ్ఞానేశ్వర్, దేవరి కుంర భీంరావ్, భారత్ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో చోరీ

బోథ్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌట (బీ) గ్రామ పొలిమేరలో ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయంలో హుండీని దొంగలు ఎత్తుకెళ్లారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం ఉదయం పూట ఆలయానికి వెళ్లిన వారికి గేటు తాళం పగలగొట్టి ఉండడంతో లోనికి వెళ్లి చూడగా హుండీ కనిపించలేదు. వెంటనే బోథ్ పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు.

యువకుడి ఆత్మహత్య

ఉట్నూర్, మార్చి29 (ఆంధ్రజ్యోతి): పెళ్లిడువచ్చినా తల్లిదండ్రులు పెళ్లి చేయడం లేదని మనస్థాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బీర్సాపేట్ చోటు చేసుకుంది. బీర్సపేటకు చెందిన పోషన్న కుమారుడు చిన్న రాజన్న(25) శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆపస్మారక స్థితిలో పడిపోయి ఉండడంతో తల్లిదండ్రులు ఉట్నూర్ ఆసుపత్రికి తరలించారు. రిమ్స్‌కు తరలించగా అక్కడ వైద్యం అందుకుంటూ మృతిచెందినట్లు ఉట్నూర్ ఎస్సై మనోహర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు


● నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల



పోలీసుస్టేషన్ ఆవరణలో పరిసరాలు పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

మామడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల అన్నారు. శనివారం రోజున మామడ పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం సమయంలో హెడ్ కానిస్టేబుల్ ఒక్కరే ఉండటం చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. జీడీ ఎంట్రీ బుక్ పరిశీలించారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. వారు మాట్లాడుతూ... ఏ కష్టం వచ్చిన పోలీసులను ఆశ్రయించాలని ఎవరు కూడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోరాదని తెలిపారు. సిబ్బంది పోలీస్ స్టేషన్‌లో ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు.

పరీక్ష సెంటర్లను పరిశీలించిన ఏఎస్పీ



ముథోల్‌లో పరీక్ష సెంటర్‌ను పరిశీలిస్తున్న ఏఎస్పీ

ముథోల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష సెంటర్లను శనివారం భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ముథోల్ ఎస్సై సంజీవ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ముమ్మరంగా పోలీస్ అక్కల పర్యటన

ఖానాపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ మండలంలో శనివారం పోలీస్ అక్కలు ముమ్మరంగా పర్యటించారు. నారీ శక్తి కార్యక్రమంలో భాగంగా పలు విభాగాల్లో పోలీస్ అక్కలు విధులు నిర్వహించినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. ఈ సందర్భంగా మహిళా కానిస్టేబుళ్లు శ్రావణి, మల్లేశ్వరిలు మండలంలోని మస్కాపూర్ గ్రామంలో గల కేజీబీవీ పాఠశాలలో మండల కేంద్రంలోని ఎంజేపీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారని ఎస్సై పేర్కొన్నారు. అనంతరం పెట్రోలింగ్ విధుల్లో పాల్గొన్నారన్నారు. ఈ విధుల్లో భాగంగా వాహనాల తనిఖీ నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు.

మత సామరస్యాన్ని చాటిన ఇఫ్తార్ విందు

దిలావర్‌పూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోత) : పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలకు పలువురు హిందువులు ఇఫ్తార్ విందు ఇస్తున్నారు. శనివారం రాత్రి మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కట్కం రాజారెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందులకు సుమారు నాలుగు వందల మంది ముస్లింలు హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం హిందువులతో కలిసి విందును ఆరగించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు రమణ, దయాకర్, రాజు, సప్పల రవి, మహేందర్, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లా పాఠశాలల్లో ముందస్తు ఉగాది వేడుకలు



దిలావర్‌పూర్ మండలం సిర్గాపూర్‌లో రైతుల వేషధారణలో విద్యార్థులు



కుంటాలలో ముందస్తు ఉగాది వేడుకలు

దిలావర్‌పూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మన సాంస్కృతి, సాంప్రదాయాలపై అవగాహన కల్పించడంలో భాగంగా శనివారం సిర్గాపూర్‌లోని ప్లేయర్ ఉన్నత పాఠ శాలలో ముందస్తు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను ఎందుకు, ఎలా జరుపుకుంటారన్న దానిపై విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా కొంత మంది విద్యార్థులు రైతు వేషధారణతో అరకపట్టి ఖరీఫ్ పనులకు శ్రీకారం చుట్టేందుకు భూమాతకు పూజలు చేయడం, అంబలి సేవించడం, ఐదు చుట్లు అరక తోలడం వంటి పనులు చేయిస్తూ పూర్తి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నరసింహ రెడ్డి మాట్లాడుతూ... రైతులు ఎంతో పవిత్రంగా భావించే ఉగాది పండుగపై విద్యార్థులకు తెలియజేసేందుకే ముందస్తు ఉగాది వేడుకల ఉద్దేశ్యమన్నారు. మన సాంస్కృతి, సాంప్రదాయాలు మనల్ని ఉన్నత విలువలు గల మనుషులుగా తీర్చిదిద్దుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

కుంటాలలో..

కుంటాల, మార్చి, 29 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల స్థానిక సృజనా విద్యానిలయంలో శనివారం ముందస్తు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ కొత్తకాపు గంగన్న ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉగాది పండుగ విశిష్టతలను తెలియజేశారు. రైతులు ఉగాది పండుగ రోజు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టడంతో పాటు తెలుగు ప్రజల ఉగాది పండుగ రోజు చేపట్టే పలు కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు పాఠశాల సిబ్బంది ఉన్నారు.

ముథోల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాల, రబీంద్ర ఉన్నత పాఠశాల, అక్షర పాఠశాలలో ముందస్తు ఉగాది ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా షడ్రుచులతో ఉగాది పచ్చడిని చేసి అందరికీ పంచిపెట్టారు. ఉగాది ప్రత్యేకతను, విశిష్టతను తెలియజేశారు. పంచాంగ శ్రవణం వినిపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు సారథి రాజు, అకాడమిక్ ఇన్‌చార్జి దేవేందర్ చారి, ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్, సుభాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వావసు నామ పంచాంగం ఆవిష్కరణ

నిర్మల్ కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వాస్తు, జ్యోతిష్య, సాముద్రిక శాస్త్ర నిపుణులు నూకల పోశెట్టి రూపొందించిన విశ్వావసు నామ సంవత్సర పంచాంగాన్ని శనివారం మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆవిష్కరించారు. నాయకులు పాల్గొన్నారు.

వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో నేడు పంచాంగ శ్రవణం

స్థానిక పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఉగాది పర్వదినం పురస్కరించుకొని సాయంత్రం 5 గంటలకు పంచాంగ శ్రవణం ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ తెలిపింది. వక్తగా టీకే వీ రామానుజాచారి హాజరవుతున్నట్లు కొండాజీ వెంకటాచారి తెలిపారు. హిందుబంధువులు హాజరు కావాలని కోరారు.

శ్రీ వీరాంజనేయ శివ సాయి సమాజ్ జంగల్ హనుమాన్ ఆలయంలో ..

ఖానాపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలోని శ్రీ వీరాంజనేయ శివ సాయి సమాజ్ జంగల్ హనుమాన్ ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. ఈ మేరకు శనివారం సాయంత్రం ఆలయ కమిటీ, భక్త బృందం ఆధ్వర్యంలో సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10:30 గంటలకు పంచాంగ శ్రవణం ప్రారంభమవుతుందని పంచాంగ శ్రవణానికి హాజరయ్యే భక్తులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నీటి ఇక్కట్లపై ఎమ్మెల్యే ఆరా

● ఆంధ్రజ్యోతి 'దాహం దాహం' కథనంపై స్పందన ● శనివారం ట్యాంకర్లతో డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నీటి సరఫరా
● పర్యవేక్షించిన మాజీ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ● ఎమ్మెల్యే శాశ్వత పరిష్కారం చూపుతారని హామీ

ఖానాపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో నీటి ఇక్కట్లపై శుక్రవారం ఆంధ్రజ్యోతి చేపట్టిన విజిట్‌లో భాగంగా శనివారం 'దాహం దాహం' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు స్పందించారు. ఈ వార్త కథనంలో ఖానాపూర్ పట్టణ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలో తీవ్రమైన నీటి కొరత ఉన్నట్లు ఫోటోలతో సహా ప్రచురించడంతో వారి సమస్యలపై ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఆరా తీసినట్లు తెలిసింది. డబుల్ బెడ్ రూమ్ కాలనీలో ఉన్న నీటి ఇక్కట్లకు వెంటనే పరిష్కారం చూపాలని స్థానిక అధికారులను ఆదేశించినట్లు మున్సిపల్ మాజీ చైర్మన్ చిన్నం సత్యనారాయణ తెలిపారు. ప్రస్తుతానికి తాత్కా లికంగా నీటి సౌకర్యం కల్పించేందుకు ఖానాపూర్ మున్సిపల్ ఆధ్వర్యంలో ట్యాంకర్లను ఏర్పాటు చేసి డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నీటి సరఫరాను ప్రారంభిం చినట్లు ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఎమ్మెల్యే చర్యలు చేపడతారని చిన్నం సత్యం కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. శనివారం ట్యాంకర్ల ద్వారా నిర్వహించిన నీటి సరఫరాను ఆయన పర్యవేక్షించారు.



డబుల్ బెడ్ రూమ్ కాలనీలో ట్యాంకర్ల ద్వారా నిర్వహిస్తున్న నీటి సరఫరాను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ చిన్నం సత్యం

గురుకుల కళాశాలలో

ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరణ

● ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్

నిర్మల్ రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర గురుకుల జూనియర్ కళాశాలలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు శనివారం పత్రిక ప్రకటనలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ డేనియల్ తెలిపారు. తెలిపిన వివరాల ప్రకారం 2025-27 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్‌లో ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని, ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ కోర్సులు బెల్లంపల్లిలో 80 బాలురకు, నిర్మల్ పట్టణంలోని సోఫీనగర్ గురుకుల పాఠశాలలో బాలికలకు ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం మే నెల 10న ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పరీక్షకు హాజరై విద్యార్థులు పదో తరగతి పాసై ఈ నెల 24 నుండి ఏప్రిల్ 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు.

మొక్కలు ఎండిపోకుండా ఏర్పాట్లు చేయాలి

దిలావర్‌పూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఆర్‌డీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం న్యూ లోలంలోని గ్రామ పంచాయతీ కమ్యూనిటీ ప్లాంటేషన్ సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా మొక్కలకు నీరు ఇవ్వాలన్నారు. ఎప్పటికప్పుడు కలుపు మొక్కలను తొలగించాలన్నారు. మొక్కలపై ఎండ ప్రభావం పడకుండా నీ డ కల్పించాలన్నారు. వచ్చే జూన్‌లో నాటేందుకు ఆరోగ్యకరమైన మొక్కలను అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎఫ్ఏ గోవిందుల మహేష్, తదితరులు ఉన్నారు.

వేసవి తాపానికి స్పృహ కోల్పోయిన చిలుక

● నీరు తాపి చిలుకను కాపాడిన యువకుడు



ముథోల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో పశు పక్ష్యాదులు అల్లాడి పోతున్నాయి. గత నాలుగైదు రోజుల నుండి భానుడి భగభగ ప్రజలతో పాటు పక్షులు, మూగ జీవాలు సైతం తల్లడిల్లుతున్నాయి. ముథోల్ మండల కేంద్రంలోని మండలాభివృద్ధి కార్యాలయం ఎదుట శనివారం మిట్ట మధ్యాహ్నం ఓ రామ చిలుక ఎండ వేడిమికి స్పృహ కోల్పోయి కింద పడిపోయింది. అక్కడే ఉన్న యువకుడు దుడ్డు సాయికుమార్ దానిని నీడకు చేర్చాడు. కొన్ని నిమిషాల తర్వాత చిలుక తేరుకోవడంతో మంచి నీరు తాపి ప్రాణం కాపాడారు. హుషారు కాగానే గింజలు వేశాడు. గింజలు తిని చిలుక తుర్రున ఎగిరిపోయింది.

తహసీల్దార్ కార్యాలయంలో కోతుల దాడి

ఖానాపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం కోతులు దాడి చేయడంతో వీఆర్ఏకు గాయాలయ్యాయి. ఉదయం విధులకు హాజరైన సుర్జాపూర్ గ్రామానికి చెందిన వీఆర్ఏ నక్కల పోసవ్వ కార్యాలయ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తోంది. మందగా వచ్చిన కోతులు ఆమెపై దాడి చేశాయి. దీంతో ఆమె కుడి తొడపై గాయమైంది.

జీపీ ఆధ్వర్యంలో ఆసుపత్రి పాత భవనాల కూల్చివేత

ముథోల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న పాత భవనాలను శనివారం కూల్చి వేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ముథోల్ గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీవో శివ కుమార్ ఆధ్వర్యంలో శిథిలావస్థలో ఉన్న ఈ భవనాలను జేసీబీ సహాయంతో తొలగించారు.



బోథ్‌లో కర్రస్తంభం పైన వేలాడుతున్న విద్యుత్ తీగలు

ప్రమాదకరంగా కర్ర స్తంభం

● మందు బాబులు జర పదిలం

బోథ్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వైన్స్ సమీపంలో కర్ర స్తంభం ఏరాటు చేసి విద్యుత్ తీగలను ఉంచడం జరిగింది అయితే పక్కనే వైన్స్ దుకాణం ఉండడంతో మద్యం తాగిన వారు ఎవరైనా కర్ర ను పట్టుకొని వెళితే కర్ర పైనున్న తీగలు కిందికి జారి పడే ఆస్కారం ఉంది విద్యుత్ శాఖ అధికారులు ప్రమా దం జరగకముందే విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

పుట్ట గొడుగుల్లా వెలుస్తున్న ఇటుక బట్టీలు

● పట్టించుకోని అధికారులు



ఇటుక బట్టీలో పనులు చేస్తున్న కార్మికులు

తలమడుగు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అదిలాబాద్ జిల్లా తనుమడుగు మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఏజెన్సీ ప్రాంతాల్లో జోరుగా ఇటుక బట్టీలు పుట్ట గొడుగుల్లా వెలుస్తున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని ఏజెన్సీ గ్రామాలైన రుయ్యాడి, అర్లి (కే) గ్రామాల్లో, ఏజెన్సీ చట్టం అమల్లో ఉన్న దాన్ని ఉల్లంఘించి జోరుగా మట్టి తవ్వకాలతో పాటు ఇటుక బట్టీలను ఏర్పాటు చేస్తున్నారు. వీరికి రాజకీయ నాయకులు అండదండలు ఉండడంతో మరింత రెచ్చిపోతున్నారు. ఇటుక బట్టీల నుంచి వచ్చే కాలుష్యంతో చుట్టుపక్కల పంటలు సైతం నాశనం అవుతున్నా కొంతమంది రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ఎవరు పట్టించుకోవడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మండలంలోని కజ్జర్ల, దేవాపూర్, పంగిడి పిప్పిరి శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇటుక బట్టీలు వెలుస్తున్నా ఎవరు కూడా పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇటుక బట్టి నిర్మాణ కోసం మైనింగ్ శాఖ. రెవెన్యూ శాఖ. ఇతర శాఖల అనుమతి తప్పనిసరి. కాని ఇటుక బట్టీ నిర్వాహకులు ఎవరి అనుమతులు లేకుండా ఇటుక బట్టీలను. ఏర్పాటు చేస్తున్నారు అంతే కాకుండా ఇటుక బట్టి కాల్చడానికి విచ్చలవిడిగా కలపను వినియోగిస్తున్నారు. కొన్ని ఇటుక బట్టి ప్రాంతాల్లో ప్రభుత్వం రైతులకు అందించే ఉచిత విద్యుత్తును సైతం ఉచితంగా వినియోగిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా ఇటుక బట్టీల ధరలు ఆకాశంలో ఉన్నాయి. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.16 వేల నుంచి రూ.20వేల వరకు విక్రయాలు నడుస్తున్నాయి. అంతేకాకుండా ఇటుక బట్టీలు పనులు చేసే కార్మికులకు మౌలిక వసతులు కల్పించడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు పనులు చేపడుతున్న పనికి తగ్గ వేతనం అందించడం లేదన్నారు. ఇటుక బట్టీలు పనిచేసే కార్మికులకు ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు ఇక్కడ కూడా ఏర్పాటు చేయలేదు. ఇకనైనా అధికారులు స్పందించి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న ఇటుక బట్టీల పై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఎడారిని తలపిస్తున్న మత్తడి వాగు ప్రాజెక్టు

ఇంకిన మత్తడి వాగు ప్రాజెక్టు

● ప్రశ్నార్థకంగా 8,500 ఎకరాల ఆయకట్టు

తాంసి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నిత్యం నిండు కుండలా కనిపించే మత్తడి వాగు ప్రాజెక్టు పూర్తిగా ఇంకి పోతోంది. ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం వడ్డాడి గ్రామ సమీపంలో ఉన్న మత్తడి వాగు ప్రాజెక్టు పూర్తిగా అడుగంటి పోయింది. దీంతో ప్రాజెక్టు కింద ఆయకట్టు రైతుల పరిస్థితి అగమ్య గోచరంగ తయారైంది. ఈ ప్రాజెక్టు ద్వారా 8,500 ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. ప్రస్తుతం ప్రాజెక్టులోని నీళ్లన్నీ ఇంకిపోతుండడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు కాగా ప్రస్తుతం మూడు మీటర్ల నీళ్లు కూడా లేవంటే అందులో అతి శక్తి లేదు. ఈ నీళ్లు కూడా గేట్ల వద్దే ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఆయకట్టు రైతులు మూడు పంటలకు సాగునీరు అందిం చుకునేవారు. కానీ ప్రస్తుతం నీళ్లన్నీ ఇంకుతుండడంతో తమ పంట పండుతుందో లేదో అని ఆందోళన వ్యక్తం చే స్తున్నారు. ప్రస్తుతం పంట చివరి దశకు వచ్చింది. మరో దఫా పంటకు నీరు అందించాల్సి ఉంటుంది. కానీ ప్రా జెక్టులోని నీళ్లన్నీ రోజుకు దగ్గ ముఖం పడుతున్నాయి. దీంతో తమ చివరి పంటకు నీళ్లు అందుతయో లేవో అన్న ఆందోళనలో ఆయకట్టు రైతులు ఉన్నారు. ఈ ప్రాజెక్టు పరిస్థితి ఇలా ఉంటే చిన్నచిన్న వాగులు వంకల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థమవుతుంది. నిత్యం నిండుకుండలా కనిపించే మతడివాగు ప్రాజెక్టు ఎడారిలా మారడంతో పశువులు, గొర్రెలు, మేకలు మేస్తున్నాయి.

జాతరకు ముస్తాబైన హరిహర క్షేత్రం

● ఏప్రిల్ 1 నుంచి 17వ వార్షికోత్సవం ప్రారంభం ● మూడు రోజుల పాటు ఉత్సవాలు ● ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ నిర్వాహకులు



జాతరకు ముస్తాబైన హరహర క్షేత్రం ఆలయం



గర్భగుడిలో వేంకటేశ్వర స్వామి విగ్రహం



గర్భగుడిలో శివపార్వతుల విగ్రహాలకు పూజలు చేస్తున్న దృశ్యం

పెంబి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీ హరిహర క్షేత్రం ఆలయం జాతరకు ముస్తాబైంది. ప్రతి సంవత్సరం ఉగాది తర్వాత ఆలయ కమిటీ, గ్రామ కమిటీ, ఆధ్వర్యంలో మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. వచ్చే నెల ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానున్నాయి. 1న ఉదయం అభిషేకం, ఆరాధనలు, స్వస్తి పుణ్యాహవచనం, రక్షబంధనము, అంకురారోపణము, బ్రహ్మకళా స్థాపనము, యాగశాల ప్రవేశము, అగ్ని ప్రతిష్ట, యజ్ఞ కార్యక్రమం, ధ్వజారోహణము, ఆలయ బలిహరణము, సాయంత్రం శ్రీ చక్రపాణి నరసింహమూర్తి యజ్ఞాచార్యులు, శ్రీ నరసింహ దీక్షిత్ యజ్ఞచార్యుల ప్రవచన కార్యక్రమము, తదనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, భజన కార్యక్రమాలు, ఏప్రిల్ 2న ఉదయం కలశముతో హనుమాన్ మందిర్ నుంచి శోభాయాత్ర, హరిహరులకు అభిషేకం, చక్రస్నానం కర్మణ, పుణ్యాహవచనము, స్థాపిత దేవత ఆరాధనలు, ఉత్సవ వరులకు స్నాపన తిరువంజనము, అభిషేకాలు, యజ్ఞ కార్యక్రమం, సామూహికంగా సువాసిని బృందానికి ముత్తైదువులకు కుంకుమార్చన, ఆలయ బలిహరణము, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం సహస్ర దీపాలంకరణ, భజన కార్యక్రమం, ఏప్రిల్ 3న ఉదయం నిత్యనిధి ఆరాధనలు, కర్మణ పుణ్యాహవచనము, మూలమంత్ర హవనము, శేష హోమం, ఆలయ బలిహరణము, గ్రామ బలి, పూర్ణాహుతి, చూర్ణాభిషేకము, శ్రీ హరిహరుల కల్యాణ మహోత్సవం, అన్న ప్రసాద వితరణము, తీర్థ ప్రసాద వినియోగం, సాయంత్రం మహా దాశ్వీరచనము, పండిత సన్మానము, హరిహరుల పల్లకి సేవ, గ్రామ ప్రదక్షిణము ఆలయ ప్రవేశం ఈ కార్యక్రమాలు యజ్ఞచార్యులు, నరసింహ చార్యులచే అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతి రోజు రాత్రి వివిధ భజన కార్యక్రమాలు, సాంస్కృతి కార్యక్రమాలు జరుపబడునని, ఈ హరిహరుల దేవతల కార్యక్రమంలో పాల్గొని దేవతల కృపకు పాత్రులు కావాలని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ, గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు.

ఉగాది పచ్చడికి మామిడి, చింతకాయల కరువు

● అరకొరగా దిగుబడులు ● ఒక్కో మామిడి కాయ రూ.15కు విక్రయాలు ● రూ.100కు కిలో చింతకాయలు





నామమాత్రపు కాతతోనున్న చింత చెట్టు, పూత, కాత లేని మామిడి చెట్టు

భైంసా, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రతికూల పరిస్థితులతో ప్రస్తుతం మామిడి, చింతకాయల దిగుబడులు అంతంత మాత్రంగానే వస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల బెడద కారణంగా రెండు పంటల దిగుబడులపై ప్రబావం చూపుతోంది. దీంతో ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని తయారు చేసుకునే ఉగాది పచ్చడికి మామిడి, చింత కాయలు కరువయ్యాయి. జిల్లాలోని మార్కెట్‌లలో వ్యాపారులు రెండు రోజులుగా అరకొరగా వచ్చిన మామిడి, చింతకాయలను విక్రయాల కొసంగాను తీసుకొచ్చారు. దిగుబడులు అంతంతమాత్రంగానే ఉండడం, కొనుగోలుదారులు అధిక సంఖ్యలో ఉండడం మూలంగా మామిడి, చింతకాయలకు డిమాండ్ అనుహ్యంగా పెరిగింది. తక్కువ సంఖ్యలో ఉన్న వాటిని కొనుగోలు చేసేందుకు గాను జనాలు ఎగబడ్డారు. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు మామిడి కాయల ధరలను రెండు రెట్లుగా పెంచి విక్రయాలు చేపట్టారు.గురువారం వరకు జిల్లాలోని వివిధ మార్కెట్‌లలో అక్కడక్కడ లభ్యమైన ఒక్కో మామిడి కాయ ధర రూ. 5తో విక్రయాలు చేపట్టగా శనివారం రోజు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే పచ్చడి కోసం అన్నివర్గాల వారు వాటి కొనుగోళ్లు చేపట్టడంతో ఒక్క రోజు వ్యవధిలోనే రూ. 10 నుంచి రూ. 15కు చేరుకున్నాయి. శనివారం భైంసా మార్కెట్ పరిధిలో సాయంత్రం వేళలో విక్రయాల కోసం తీసుకొచ్చిన మామిడి కాయలు పూర్తి స్థాయిలో విక్రయించబడ్డాయి. అటు తర్వాత వాటి కొనుగోలు కోసం వచ్చిన జనాలు ఉట్టి చేతులతోనే ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితులు తలెత్తాయి.ఇక చింతకాయలు రెండు రోజుల క్రితం వరకు కిలో ఒక్కింటికి రూ.70 నుంచి రూ.80లతో విక్రయించగా శనివారం ఉగాది పర్వదిన వేడుకలను పురస్కరించుకొని రూ.100 నుంచి రూ.120 వరకు ధర పెంచి విక్రయించారు.

విద్యతో పాటు పండుగల గురించి తెలుసుకోవాలి



పచ్చడి తయారు చేసే విధానాన్ని విద్యార్థులకు వివరిస్తున్న శ్రీనివాస్

మామడ, మార్చి 29 (ఆంధ్ర జ్యోతి) : ఉగాది పచ్చడి రుచులను తెలుగు పండగ తీపి, కారం, ఒగరు, పులుపు, ఉప్పు, చేదు రుచులను సమిలితం చేసే పండగ ఉగాది. ఈ ఉగాది ఉత్సవాల సందర్భంగా మామడ మండలం లోని మారుమూల గిరిజన గ్రామ మైన వెంకటాపూర్ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు వీఎస్ శ్రీనివాస్ ముందస్తు ఉగాది ఉత్సవాలను గ్రామస్థులకు, విద్యార్థులకు పాఠశాలలో వివరించారు. విద్యార్థులకు ఒక్కో రుచి ప్రాముఖ్యతను, ఔషధ గుణాలను విద్యార్థులకు తెలియజేశారు. తెలుగు పండుగలు మూడవ తరగతి పాఠంలో నాలుగో తరగతి పాఠంలో మన పండుగలు పాఠంలో భాగంగా చైత్రమాస పాడ్యమి రోజున ఉగాది ప్రారం భమవుతుంది. ఇదే మనకు అసలైన తెలుగు నూతన సంవత్సరమని విద్యార్థులకు తెలియజేశారు. మన పండుగలను, సంస్కృతిని గుర్తుంచుకోవాలని తెలిపారు.

పచ్చడి తయారీ విధానం: ఉపాధ్యాయుడు శ్రీనివాస్

ముందుగా వేప పూతను నీటితో శుభ్రంగా చేసుకోవాలి. తరువాతర బెల్లం తురుముకుని పక్కన పెట్టుకోవాలి. మామడి కాయను చిన్న ముక్కలుగా కట్ చేసుకోండి. ఈ చింతపండును నానబెట్టి రసం తీసి వడకట్టుకోవాలి. చింతపండు రసంలో బెల్లం వేసి కరిగే వరకు కలపాలి. తరువాత ఉప్పు, మామిడి ముక్కలను వేసి కలపాలి. ఇప్పుడు వేపపూత, అరటి పండు ముక్కలు వేయండి. అన్నింటినీ వేసి బాగా కలిపితే ఉగాది పచ్చడి సిద్ధం అవుతుంది.

పలు పాఠశాలల్లో ముందస్తు ఉగాది



విజ్ఞాన్ స్కూల్‌లో ఉగాది పండుగ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

బోథ్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ పాఠశాలల్లో శనివారం ముందస్తు ఉగాది పండుగ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉగాది పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అంతేగాక పండుగ రోజున ఉగాది పచ్చడి తయారీ గురించి వివరించారు. దాని వల్ల కలిగే ఆరోగ్య ఫలితాలను ప్రిన్సిపాల్ ఏద్మల శైలజ వివరించారు. నాగభూషణం పాఠశాలలో విద్యార్థులు రంగురంగుల ముగ్గులు వేసి నూతన వస్త్రాలు ధరించి ఉగాది ప్రాముఖ్యతను రైతులు జరుపుకునే పండుగ విదానాన్ని ప్రిన్సిపల్ కిషోర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.35 (ఆదివారం సాయంత్రం) సహర్ : 4.50 (సోమవారం ఉదయం)

ఎవరైతే అల్లాహ్‌కు విధేయత కనబరుస్తారో అతను గొప్ప విజయాన్ని సాధిస్తాడు

స్కోచ్ అవార్డును అందుకున్న జిల్లా కలెక్టర్

ఆదిలాబాద్‌రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) :ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా ప్రతిష్ఠాత్మక స్కోచ్ అవార్డును అందుకున్నారు. జిల్లాలో ఆరోగ్య పాఠశాల పేరిట వినూత్న కార్యక్రమాన్ని అమలు చేసి విద్యార్థులకు ఆరోగ్యకర జీవన శైలిని అలవాటు చేయడంలో చేసిన కృషికి గాను స్కోచ్ అవార్డుకి ఎంపికైన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు.

స్కోచ్ అవార్డు అందుకున్న ఐటీడీఏ పీవో

ఉట్నూర్: జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న బాలికల రక్తహీతన అధిగమించడానికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా గిరిపోషణ మిత్ర కార్యక్రమాన్ని అమలు చేయడంతో స్కోచ్ అవార్డుకు ఎంపికయ్యారు. ఢిల్లీ వేదికగా శనివారం ఇండియా హ్యాబిటెడ్ సెంటర్‌లోని జుకరం దహాల్లో స్కోచ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రాంచంద్రన్, స్కోచ్ గ్రూప్‌చైర్మన్ డాక్టర్ సమీర్‌కొచ్చార్, వైస్ చైర్మన్ డాక్టర్ గురుశరన్ దంజాల్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిపోషణ మిత్రపథకం ద్వారా ఆడపిల్లల్లో ఏర్పడుతున్న రక్తహీనతను అధిగమించడానికి ఇప్పపువ్వు లడ్డులతో పాటు, పోలిక్‌యా సిడ్, ఐరన్‌మాత్రలు అందిస్తూ గిరిజనబాలికల ఆరోగ్యంపై శ్రద్ధ చూయించారు. గిరిజనులకు ఐదురూపాయలకే ప్లేట్‌భోజనం అందించడానికి గిరిజనభవన్‌లో గిరిజన క్యాంటీన్ ఏర్పాటు చేయించారు. గిరిజన క్యాంటీన్ నిర్వాహకులుగా గిరిజనులను నియమించి వారికి ఉపాధి కలిగించడానికి ప్రయత్నించడంతో ఢిల్లీప్రతినిధులు స్కోచ్‌అవార్డుకు ఎంపిక చేశారు. పీవో వెంట జిల్లా ఏజెన్సీ అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కుడిమెత మనోహర్ ఉన్నారు.



అవార్డు అందుకుంటున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా


అవినీతి గద్దలు



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఏసీబీ కార్యాలయం

- ప్రభుత్వ శాఖల్లో రెచ్చిపోతున్న కలెక్షన్ కింగ్‌లు
- రెండు మాసాల్లోనే ఏసీబీకి చిక్కిన ముగ్గురు అధికారులు
- సెటిల్‌మెంట్‌లు చేస్తున్న డ్రైవర్లు, ప్రైవేట్ వ్యక్తులు
- దూకుడు పెంచిన ఏసీబీ.. జిల్లా అధికార వర్గాల్లో వణుకు
- ఏసీబీ చేతిలో మరికొంత మంది వసూల్ రాజాల చిట్టా

ఆదిలాబాద్, మార్చి29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కొంత మంది అధికారులు అవినీతికి పాల్పడుతూ అడ్డగోలు సంపాదనకు ఎగబడుతున్నారు. ప్రభుత్వం ఇస్తున్న వేతనం చాలదన్నట్లుగా అక్రమ సంపాదనకు ఆశ పడుతూ ఏసీబీ వలకు చిక్కి కటకటాల పాలవుతున్నారు. ఎలాంటి కష్టం లేకుండానే తేలికగా వస్తున్న సంపాదనకు అధికారులు అలవాటు పడుతున్నారు. పైసలు ఇవ్వనిదే పని కాదంటూ మొండికేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా లంచాలకు అలవాటు పడిన కొంత మంది అధికారులు ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్నారు. దీంతో గత్యంతరం లేక ఎంతో కొంత ముట్టచెప్పి పనులు పూర్తి చేయించుకుంటున్నారు. కానీ కొంత మంది ధైర్యంగా ముందుకు వస్తు లంచావతారుల భరతం పడుతున్నారు. ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తూ అవినీతి అధికారులను కటకటాల వెనక్కి పంపిస్తున్నారు. జిల్లాలో గడిచిన రెండు మాసాల్లోనే ముగ్గురు అవినీతి అధికారులు ఏసీబీ వలకు చిక్కి పట్టుబడడం చర్చనీయాంశంగా మారుతోంది. దీన్నిబట్టి చూస్తుంటే ప్రభుత్వ శాఖల్లో ఎంతో అవినీతి పెరిగి పోతుందో తెలుస్తునే ఉంది. ఉట్నూర్ మండలం శ్యాంపూర్ పశు వైద్యాధికారి రాథోడ్ రమేష్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. దీన్ని మరిచిపోక ముందే ఆదిలాబాద్ విద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డీఈఈ శంకర్ ఏసీబీ వలలో పడ్డారు. తాజాగా వైద్య ఆరోగ్యశాఖ డీఈఎంవో రవిశంకర్ ఏసీబీ అధికారులకు పట్టుబడడం కలకలం రేపుతోంది. అయినా ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి తగ్గుముఖం పట్టడం లేదంటున్నారు. మరికొంత మంది అవినీతి అధికారులపై ఏసీబీ ప్రత్యేక నిఘాను సారించినట్లు తెలుస్తోంది.



ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఉట్నూర్ మండలం శ్యాంపూర్ పశు వైద్యాధికారి రాథోడ్ రమేష్. ఇతను 2025 జనవరి 29న శ్యాంపూర్ పశువైద్యశాలలోనే పని చేస్తున్న ఓ కింది స్థాయి ఉద్యోగికి ఎల్పిసి ఇచ్చేందుకు రూ.25వేలను డిమాండ్ చేసి రూ.15వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వల వేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.



ఏసీబీ అధికారులు వల వేసి పట్టుకున్న ఈ అధికారి పేరు శంకర్. ఇతను ఆదిలాబాద్ విద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ విభాగంలో డీఈఈగా పని చేస్తున్నారు. మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణాన్ని చేపడుతున్న సబ్ కాంట్రాక్టర్ నుంచి రూ.2లక్షల లంచాన్ని డిమాండ్ చేసి చివరకు లక్ష రూపాయలకు బేరం కుదుర్చుకున్నాడు. దీంతో లంచం సొమ్మును తీసుకుంటుండగా ఏసీబీ అధికారుల వలకు చిక్కారు.



మెడికల్ షాపు యజమాని నుంచి రూ.30వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండ్‌గా పట్టుబడిన ఈ అధికారి పేరు రవిశంకర్. ఇతను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డీఈఎంవోగా విధులు నిర్వహిస్తున్నారు. గుడిహత్నూర్ మండలం మన్నూరు గ్రామానికి చెందిన ఓ మెడికల్ షాపు యజమాని నుంచి లంచం సొమ్మును తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు పట్టుబడి కటకటాల పాలయ్యాడు.

అధికారుల ముందు చూపు

అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కకుండా లంచవతారులు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఏసీబీ అధికారుల నుంచి ముప్పు పొంచి ఉండడంతో ముందు చూపుతో వ్యవహరిస్తున్నారు. నేరుగా లంచం తీసుకోకుండా డ్రైవర్లు, కింది స్థాయి సిబ్బంది, ప్రైవేట్ వ్యక్తులను రంగంలోకి దింపుతున్నారు. ఏదైనా జరగకూడనిది జరిగితే తమ చేతికి మట్టి అంటకుండా ముందు చూపుతో వ్యవహరిస్తున్నారు. కొంత మంది అధికారులు కార్యాలయాల్లోనే తమ ప్రతినిధుల ద్వారా లంచాలకు పాల్పడుతుండగా మరికొంత మంది రహస్య ప్రదేశాలు, హోటళ్లు, ఇంటి వద్ద లంచం సొమ్మును తీసుకుంటున్నారు. కొంత మంది అధికారులు అతి తెలివిగా తమ దగ్గరి బంధువుల ఫోన్ పే, గూగుల్‌పేల ద్వారా లంచం సొమ్మును రాబట్టుకుంటూ ఏసీబీకి దొరకకుండా తప్పించుకుంటున్నారు. కొత్త వ్యక్తులకు వాట్సాప్ కాల్ చేస్తూ సెటిల్‌మెంట్‌లు చేసుకుంటున్నారు. ఎక్కడ ఆధారాలు దొరకకుండా ముంద స్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇటీవల ఓ జిల్లా స్థాయి అధికారి తన డైరీలో ఎవరి నుంచి ఎంత రావాల్సి ఉందో రాసుకోవడం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడం చర్చనీయాంశంగా మారుతోంది. దీంతో ఈ అధికారిపై బదిలీ వేటు వేసినా మళ్లీ అదే శాఖలో కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

ఏసీబీ రైడ్స్ కలకలం

జిల్లాలో గత కొద్ది రోజులుగా ఏసీబీ అధికారుల రైడ్స్ కలకలం రేపుతోంది. ఏసీబీ పేరెత్తితేనే అధికార వర్గాల్లో వణుకు కనిపిస్తోంది. గత కొంత కాలంగా ఏసీబీ అధికారుల దూకుడుతో అవినీతి అధికారుల బాగోతం బయట పడుతోంది. ఇన్నాళ్లు రహస్యంగా లంచాలకు రుచిమరిగిన అధికారులు ఏసీబీ వలకు చిక్కి కటకటాల పాలవుతున్నారు. ఇప్పటికే విద్యా, వైద్యం, పశువైద్య శాఖల్లో పని చేస్తున్న అవినీతి జలగల ఆగడాలకు ఏసీబీ అధికారులు అడ్డుకట్ట వేశారు. అలాగే రెవెన్యూ, ఎక్సైజ్, వ్యవసాయం, రవాణా, ఆర్‌అండ్‌బీ, మార్కెటింగ్, పోలీసు శాఖలపై ఏసీబీ అధికారులు ప్రత్యేక దృష్టిని సారించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొంత మంది వసూలు రాజాల చిట్టా ఏసీబీ అధికారుల చేతికి అందడంతో నిఘా సారిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే అవినీతి అధికారులకు వలవేసి పట్టుకునేందుకు ఏసీబీ ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. తరచూ అవినీతి ఆరోపణలు వస్తున్న ప్రభుత్వ శాఖలపై మరింతగా నిఘాను పెంచుతున్నారు. ముఖ్యంగా అవినీతికి సంబంధించిన వార్త కథనాలు, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సమాచారాన్ని సేకరిస్తున్నారు. నిర్భయంగా అవినీతి అధికారులపై ఫిర్యాదు చేయాలంటూ టోల్‌ఫ్రీ నెంబర్లతో పాటు ఏసీబీ అధికారుల సెల్ నెంబర్లను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.



లంచం అడిగితే మాకు చెప్పండి

- విజయ్‌కుమార్, ఏసీబీ డీఎస్పీ, ఆదిలాబాద్

ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం అడిగితే ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకురావాలి. ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064 బోర్డులను ఏర్పాటు చేస్తాం. బాధితులు నిర్భయంగా ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం. ఏసీబీ డీఎస్పీ నెంబర్ 91543 88963, సీఐ 91543 88964, 91543 88965 నెంబర్లను సంప్రదించాలి. ఏసీబీ కార్యాలయంలోనూ నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. బాధితుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతాం. అవినీతి రహిత సమాజానికి అందరు సహకరించాలి.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఇఫ్తార్ విందులో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్



ఉట్నూర్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, మార్చి29(ఆంధ్రజ్యోతి)ప్రతి ఒక్కరూ మత సామరస్యాలను పాటిస్తూ పండుగ పర్వదినాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఖానాపూర్ శాసనసభ్యులు వెడమబొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని జామా మజీదు ఆవరణలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ తమ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు. పండుగలను ప్రశాంత వాతా వరణంలో జరుపుకోవడానికి శాంతిభద్రతలు కాపాడుతూ ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేకప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మతపెద్దలు ముంతాజ్ అహ్మద్, సయ్యద్ కరీం, మొహమ్మద్ ఇబ్రహీం, మౌలానా కలీంలతో పాటు డీడీ జాదవ్ అంబాజి, ఐటీడీఏ ఈఈ జాదవ్ తానాజి పాల్గొన్నారు.

ప్రజలందరూ ఐకమత్యంగా ఉండాలి : ఎస్పీ



ఖర్జూర తినిపిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

ఆదిలాబాద్‌రూరల్/ ఇచ్చోడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పండుగలను శాంతియుత వాతావరణంలో ఐకమత్యంగా జరుపుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లోని కలెక్టర్‌చౌరస్తా వద్ద గల ఖిజార మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఆయన పాల్గొన్నారు. సోదరభావంతో ప్రతి ఒక్కరూ ఐక్యమత్యంగా ఉండాలని, శాంతి సామరస్యాలతో సంతోషకర జీవితాన్ని గడపాలన్నారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి విందు ఆరగించారు. ఆయనతో పాటు డీఎస్పీ జీవన్ రెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం..

ఆదిలాబాద్ రూరల్ : సైబర్ క్రైమ్‌ను అప్రమత్తత, అవగాహన ద్వారా అడ్డుకోవడం సాధ్యమవుతుందని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్ లెన్ నెంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, వెబ్‌సైట్‌లోలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎలాంటి నష్టాన్ని అయినా సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ఆకట్టుకున్న మిత్రమిలన్



ప్రాచీన భారతీయ నాణెల ప్రదర్శనను తిలకిస్తున్న దృశ్యం



కనిష్క కాలం నాటి నాణెలు



విష్ణుకుండిన కాలం నాటి నాణెలు

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి29 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కళాశ్రమంలో ఉగాది పండుగను పురస్కరించుకుని ప్రతిసంవత్సరం నిర్వహించే మిత్రమిలన్ కార్యక్రమం ఈ యేడు కూడా వైభవంగా ప్రారంభమైంది. ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలతో కూడిన హస్తకళలను నేటితరానికి అందించాలనే సంకల్పంతో గురూజీ రవీంద్రశర్మ ఈ కళాశ్రామాన్ని నెలకొల్పారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎన్నో కళాకండాలు ఈ కళాశ్రమంలో ఉన్నాయి. అయితే ప్రతి సంవత్సరం ఉగాది సందర్భంగా నిర్వహించే మిత్రమిలన్‌లో భాగంగా హస్తకళలు, కళానైపుణ్యంపై చర్చలు సాగుతాయి. అయితే కళాశ్రమ వ్యవస్థాపకులు రవీంద్రశర్మ గతించడంతో (మృతి చెందడంతో) ఆయన కుమారుడు అపూర్వ శర్మ ఆధ్వర్యంలో ఈ మిత్రమిలన్ కార్యక్రమం కొనసాగుతువస్తుంది. ఇందులో భాగంగానే ఆదిలాబాద్‌కు చెందిన కథా రచయిత బి.మురళీధర్ సేకరించిన ప్రాచీన భారతీయ నాణెలతో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కనిష్కుడు, బహమని సుల్తానులు, ఔరంగజేబు, అక్బర్, విష్ణుకుండినుల కాలంనాటి బంగారు, వెండి, రాగి నాణెలతో పాటు ఇతర నాణెలను, కరెన్సీ నోట్లను, ప్రాచీన నాణెలకు సంబంధించిన పుస్తకాలను ఇందులో ప్రదర్శించారు. అలాగే భీంపూర్ మండలం బెల్సారి రాంపూర్ గ్రామానికి చెందిన ఓజా కళాకారుడు ఇంద్రజిత్ ఇత్తడి కళాకృతులను ప్రదర్శించాడు. మరోవైపు పలువురు గిరిజన విద్యార్థులు తమ సృజనాత్మకతతో క్యాన్వాస్ పై వేసిన గోండి ఆర్ట్ చిత్రాలను కూడా ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆకాశవాని విశ్రాంత సంచాలకుడు సుమనస్పతిరెడ్డి, ప్రముఖ నవలా రచయిత, చిత్రకారుడు ఎస్.రాజవర్ధన్, కళాకారుడు గోపి తదితరులు పాల్గొన్నారు.



గోండి ఆర్ట్ చిత్రాలను వేస్తున్న విద్యార్థులు

ఇష్టారీతిన వాహనాలను ఆపితే కఠిన చర్యలు : ఇచ్చోడ సీఐ



భీమేష్, సీఐ

నేరడిగొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా వాహనాలు ఆపి భయభ్రాంతులకు గురిచేస్తే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని ఇచ్చోడ సీఐ భీమేష్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేరడిగొండ మండలంలోని రోల్‌మామడ టోల్ ప్లాజా వద్ద శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో హైవే మీద లారీలు ఆపుతున్నారని సమాచారం వచ్చింది. పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా మామడ టోల్‌ప్లాజా వద్ద ఎటువంటి అధికారం లేకున్నా మహారాష్ట్ర నుంచి నిజామాబాద్ వెళుతున్నటువంటి ఎద్దుల వాహనాలను అక్రమంగా కొందరు యువకులు అడ్డుకొని డ్రైవర్లు జావిద్‌ఖాన్, జుబేర్ఖాన్‌లను బెదిరించారన్నారు. లారీలలో ఎక్కిచూస్తూ లారీ డ్రైవర్లను కొట్టడానికి వెళుతూ భయ భ్రాంతులకు గురిచేశారని బాధితులు ఆరోపించారు. భయభ్రాంతులకు పాల్పడిన వారిపై శనివారం నేరడి గొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఈ సందర్భంగా తెలిపారు.

290 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బియ్యం లారీ

ఆదిలాబాద్ రూరల్/ఇచ్చోడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రం మీదుగా అక్రమంగా తరలిస్తున్న బియ్యం లారీని శనివారం ఇచ్చోడ సీఐ భీమేష్, ఎస్సై తిరుపతి పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సై తిరుపతికి వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు బోధన్ నుంచి ఆదిలాబాద్‌కు తరలిస్తున్న 290 క్వింటాళ్ల ప్రభుత్వ రాయితీ బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. లారీ తనిఖీ చేయగా అందులో 290 క్వింటాళ్ల ప్రభుత్వ రాయితీ బియ్యం లభించిందని తెలిపారు. జైనథ్ మండలానికి చెందిన డ్రైవర్ సిడాం మోతిరామ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ రాయితీ బియ్యాన్ని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.